క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సర్పంచ్ మేరీ, వార్డు సభ్యులు, వైస్ ఎంపీపీ

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ పడవల మేరీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ప్లాంట్ ఫర్ మదర్ నేచర్ పిలుపు మేరకు గురువారం మొగల్తూరులోని పాలగుంట చెరువు ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కై లా సుబ్బారావు, వార్డు సభ్యులు ఎల్లమిల్లి మంగ, ఉపాధి హామీ పథకం జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్: ప్రతీ ఒక్కరూ మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలోనూ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీకే వీరభద్రరావు, ఏపీవో శ్రీనివాస్, ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: ఈ నెల 24వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అత్తిలి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

తణుకు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అత్తిలి మండలం నూతన కమిటీను గురువారం ఎన్నుకున్నారు. సమితి తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బుదాసరి కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అబ్బుదాసరి లాజర్ మాదిగ పాల్గొన్నారు. అత్తిలి మండల అధ్యక్షుడిగా గెద్దం కిరణ్‌కుమార్ (అత్తిలి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లేటి వినయ్ (పాలి), ఉపాధ్యక్షుడిగా మెరిపే సత్యనారాయణ (ఉరదాళ్లపాలెం), ప్రధాన కార్యదర్శిగా నేకూరి రవికుమార్ (బల్లిపాడు), కార్యనిర్వాహక కార్యదర్శిగా తానేటి మోహన్ (తిరుపతిపురం), కార్యదర్శిగా కోడెల్లి సత్యమూర్తి (ఉనికిలి) ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి



పట్టణంలో హెల్మెట్ వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో గురువారం పోలీస్ ఐలాండ్ వద్ద హెల్మెట్ ర్యాలీని ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం

భీమవరం: వికలాంగుడైన బందారు సుబ్బారావుకు సినీ నటుడు చిరంజీవి అభిమానులు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

చిరు జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చిరంజీవి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెనుగొండ, పాలకొల్లులోనూ వేడుకలు నిర్వహించారు.

ప్రశ్నార్థకంగా నాడు-నేడు పనులు

- వైఎస్సార్‌సీపీ హయాంలో పాఠశాలలకు మహర్దశ
- ప్రభుత్వం మారడంతో నిలిచిన అభివృద్ధి పనులు



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల పనులు

మొగల్తూరు: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టి వందలాది పాఠశాలలను అభివృద్ధి చేసింది. ఊడిపడిపోతున్న పైకప్పులు, చిన్నపాటి వర్షానికే మునిగిపోయే తరగతి గదులు, కూర్చునేందుకు బల్లలు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడ్డారు. ఏ సమయంలో పైకప్పు పడిపోతుందనే భయంతో ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అటువంటి పరిస్థితి నుంచి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మొగల్తూరు మండలంలో ప్రాథమిక పాఠశాలలు 68, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 10 ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలలు శిథిలావస్థలకు చేరడంతో పాటు ఏ సమయంలో పైకప్పులుపడిపోతాయో తెలియక ఆందోళనలో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు గడిపేవారు.

నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపు రేఖలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం విద్యార్థులు, ఉపాధ్యాయుల పాలిట వరంలా మారింది. విద్యార్థులే ఆశ్చర్యపోయే రీతిలో పాఠశాలల భవనాలు, తగరగతి గదులు, లేస్‌లు అభివృద్ధి చెందాయి. మొగల్తూరు మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 18 పాఠశాలలను రూ.3.83 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. రెండో విడతలో 46 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాలను రూ.17.83 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరు అయ్యి, పనులు ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండు నెలలుగా అభివద్ధి పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

10 పాఠశాలల్లో నిలిచిన అభివృద్ధి పనులు

నాడు-నేడు పథకంలో రెండో విడత చేపట్టిన అభివృద్ధి పనుల్లో సుమారు 10 పాఠశాలల పనులు నిలిచిపోయాయి. మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పీపీతోట, కేపీ పాలెం ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. మొగల్తూరు ఉన్నత పాఠశాలలో పాత భవనం మరమ్మతులకు గురికావడంతో మరో భవనంలో క్లాసులు నడుపుతున్నారు. అయితే ఆ భవనంలోనూ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో నాడు-నేడు పథకంలో రూ.52 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే అదనపు తరగతి గదుల పనులు రెండు నెలలుగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.

అదనపు గదులు ఎప్పుడు పూర్తవుతాయో?



మా గ్రామంలోని పీపీతోట ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. అయితే పనులు ప్రారంభించి, మధ్యలో ఆపేశా రు. పనులు మరలా ఎప్పుడు ప్రారంభిస్తారో, ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

– అద్దాల సాంబమూర్తి, లక్కువారితోట

బీఎల్‌వోల ఇంటింటి సర్వే

పెనుగొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాలప్రకారం బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబి తా సవరణ చేయాలని పెనుగొండ మండల తహసీల్దార్ జి.అనితాకుమారి అన్నారు. గురువారం పెను గొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో అవగాహన కల్పించారు. మండలంలో 57 మంది బీఎల్‌వోలు ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు చేయడానికి కృషి చేయాలన్నారు. 01-01-2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారి వద్ద దరఖాస్తులు తీసుకొని, ఓటు హక్కు కల్పించాలన్నారు. అదేవిధంగా అనర్హులను జాబితా నుంచి తొలగించాలన్నారు. సర్వే ప్రక్రియ అక్టోబరు 18వరకూ నిర్వహిస్తారన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతతో తప్పులు లేకుండా ఓటర్ల జాబిటా తయారికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలు, రవాణా సేవల్లో సమస్యల పరిష్కారంకోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. డిపో పరిధిలోని నరాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, ఆచంట చుట్టు పక్కల ప్రాంతాల వారు తమ సమస్యలు, సూచనలు, సలహాలు ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ సెల్:99592 25486 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మామిడి రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి ప్రియదర్శిని

మొగల్తూరు: మామిడి తోటల్లో కాయలు కోసిన తరువాత కొమ్మల కత్తిరింపు అనంతరం తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాకాధికారి కె.ప్రియదర్శిని సూచించారు. రామన్నపాలెంలోని సచివాయలం-1 పరిధిలో రైతు సేవా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మామిడి రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 20, 30 సంవత్సరాల వయస్సు గల మామిడి చెట్లకు కొమ్మలు కోసిన తరువాత ఒక్కో చెట్టుకు 200 గ్రాముల యూరియా, 200 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ 200 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పాస్ఫేట్‌ను చెట్టు మొదళ్లలో వేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నుంచి రక్షణకు క్లోరిఫైరిపాస్ 1.5 మిల్లీ లీటర్లు, వేపనూనె 3 మిల్లీ లీటర్లు, జిగురు 0.5 మిల్లీ లీటర్లను లీటరు నర నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు తాము తమ సిబ్బంది అందుబాటులో ఉంటామన్నారు. ఈ సమావేశంలో మామిడి రైతులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పారితోషికం



విద్యార్థులకు పారితోషికం అందిస్తున్న ఎంఈవో వీరాస్వామి, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: విద్యా వ్యవస్థ బలాబలాలు బలహీనతలు అంచనా వేయడానికి దేశ వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ విద్యా ప్రగతి, రాష్ట్ర విద్యా ప్రగతి అంచనా సర్వేలో అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థుల సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. గురువారం స్థానిక ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులకు పారితోషికం అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో వీరాస్వామి మాట్లాడుతూ 2023 నవంబర్ 3న దేశ వ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పారితోషికం అందించిందన్నారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులకు రూ.50 వేలు నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలతో ప్రజల ఇక్కట్లు



రైల్వేస్టేషన్ రోడ్‌లో ఇరువైపులా నిలిపి ఉంచిన ప్రైవేట్ వాహనాలు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఇష్టానుసారం ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్‌రోడ్‌లో ఇటీవల రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్ విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలా మంది ప్రత్యామ్నాయంగా, ఈ రోడ్‌లో ప్రయాణిస్తున్నారు. ఇటీవల స్టేషన్ పక్కనుంచి సరిపల్లి మీదుగా బైపాస్ కూడా నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. అయితే ఈ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రైవేట్ బస్సులు నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడైనా స్థలం కేటాయించాలని, ఈ రోడ్‌లో సమస్య పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పెంటపాడు సెక్టార్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



జగన్నాథపురం నెం.139 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: బాల్యవివాహాలను అరికట్టేందేకు గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలు పటిష్టంగా పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతలు పేర్కొన్నారు. పెంటపాడు సెక్టార్ సమావేశంలో భాగంగా గురువారం పెంటపాడులోని ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుక్త వయస్సు చిన్నారులకు అవగాహన కల్పించారు. 100 రోజులు శక్తి మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు బేటీ బచావో- బేటీ పడోవో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల అక్రమ రవాణా, తదితర విషయాలను యుక్తవయస్సు బాలికలకు తెలియజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మరక్షణలో తర్ఫీదు పొందాలి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు ఆత్మరక్షణ విద్యలో తర్ఫీదు పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జగన్నాథపురం నెం.139 అంగన్‌వాడీ కేంద్రంలో ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, వాటిని అడ్డుకునే చట్టాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రామలక్ష్మి, గీత, అంజికుమారి, ఎం.శాంతకుమారి, కే.గీత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

భీమవరం: స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవాకార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మానవత సేవా సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో క్విట్ ఇండియా స్థూపం నుంచి గురువారం చేపట్టిన శాంతి ర్యాలీని కలెక్టర్ నాగరాణి ప్రారంభించి మాట్లాడారు. భీమవరంలో మానవతా సేవా సంస్థ మొక్కలు నాటడం, పేదలకు సహాయం అందించడం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స మోహన్‌వర్మ, వేమూరి రాంబాబు మాట్లాడుతూ 2003లో 103 మందితో మానవతా సంస్థ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 70 వేల మంది సభ్యులతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుద్దరాజు వెంకటపతిరాజు, కారుమూరి ప్రసాద్, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, బొండా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో చివటం త్రిశూలపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ఎంపీపీ-1 గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మూడు నెలలుగా మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని సమీక్షించడంతోపాటు రాబోయే మూడు నెలల కాలంలో చేపట్టే పనులపై చర్చ జరుగుతుందని ఆయన వివరించారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గ్రామ సభలు

మొగల్తూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.బాబ్జిరాజు గురువారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు చేపట్టిన పనులను సమీక్షించి, కొత్త పనులను గుర్తిస్తామన్నారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభకు కలెక్టర్ నాగరాణి, ఉన్నతాధికారులు హాజరుకానున్నారన్నారు.

యాత్రికుల వసతి సముదాయానికి శంకుస్థాపన

పెనుగొండ: తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ యాత్రికుల వసతి గృహ సముదాయ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. గురువారం పెనుగొండలో వాసవీ శాంతిధాం సమీపంలో తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సభ్యులు శంకుస్థాపనను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పీతాని తనయుడు వెంకట్, స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యులు పులవర్తి రెడ్డియ్య గుప్తా, ఉద్దగిరి దత్తు, తుమ్మల పల్లి రవీంద్ర, పి.నితిన్‌బాబీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లంకలకోడేరు, దగ్గులూరు మెడికల్ కళాశాల, వెంకటాపురం, గవరపేట, బల్లిపాడు గరువు, బల్లిపాడు, శ్రీలంక పుంత, శివదేవునిచిక్కాల, జొన్నలగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అడవిపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కూడా వార్షిక మరమ్మతుల కారణంగా ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. యాళ్లవాని గరువు, సబ్బేవారిపేట, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

నేడు ఆక్వా డీలర్ల సదస్సు

నరసాపురం రూరల్: ఆక్వా రైతులకు, డీలర్లకు మత్స్యశాఖ, ఎంపెడా ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక అంబేద్కర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ సదస్సులో అప్పడా, ఎంపెడా రిజిస్ట్రేషన్, ఆక్వా సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. ఆక్వా రైతులు, డీలర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

అత్తిలి: మండలంలోని కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంస్కృత భాష గొప్పతనాన్ని, రామాయణ, మహాభారతంలో ముఖ్య విషయాలను ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ నృత్యాలు, గీతాలను ఆలపించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృత భాష ఉపాధ్యాయుడు మాట్ల పోశిబాబు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జె.నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు మితంగా వాడాలి



చినమల్లంలో పొలంబడి కార్యక్రమం

పెనుగొండ: వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు సిఫారసు మేరకు రసాయనిక ఎరువులు, సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు మితంగా వినియోగించడం రైతులు అలవాటు చేసుకోవాలని మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం పెనుగొండ మండలం చినమల్లంలో జీఏపీ-పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఏ ఆనందకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనం రైతులే తయారు చేసుకోనే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం కోసమే గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి స్పందన, శాస్త్రవేత్త డాక్టర్ జే దయాన్‌ప్రసాద్‌బాబు, డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు కృతజ్ఞతలు



దళిత సంఘ పెద్దలతో మాట్లాడుతున్న మాలమహానాడు ఐక్య జేఏసీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా పాలకొల్లు పట్టణంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు సహకరించినందుకు మాల మహానాడు ఐక్య జేఏసి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జేఏసీ గౌరవ అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాద్ తెలిపారు. గురువారం పోడూరు మండలం పెనుమదం గ్రామం దళిత పేటలో సంఘ పెద్దలతో మాల మహానాడు ఐక్య జేఏసి నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు ఐక్య జేఏసీ నాయకులు నల్లి రాజేష్, మానుకొండ శ్రీనుబాబు, మద్దా చంద్రకళ, కోట రత్నరాజు, కొర్రపాటి వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తణుకులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పీ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు గురువారం రాష్ట్రపతి రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండించాలని కోరారు. ఇటువంటి సంఘటనలపై ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం పట్టణంలోని ప్రధాన కూడలిలో విద్యార్థినీ, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఏ మారుతీదేవి చౌదరి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి

భీమవరం: రక్తదానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బందెల హనుమంతరావు, ముమ్మన విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో యూనియన్ సభ్యులు రక్తదానం చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న అవసరాలకు సరిపడా రక్తం అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ అధినేత అల్లూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రక్తదానంపై అనేక అపోహలు ఉన్నాయని, వీటి నివృత్తి కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. యూనియన్ సభ్యులు హనుమంతురావు, విజయ్‌కుమార్, గద్దె రామారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు బాసటగా నిలవాలి

భీమవరం: సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థినులకు వసతి గృహ అధికారులు బాసటగా నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ చిల్డ్రన్స్, కళాశాల వసతి గృహాలను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కూర్చుని వారికి వడ్డిస్తున్న పదార్థాలను రుచి చూశారు. బాగా చదువుకోవాలని, విద్య ద్వారానే అన్ని సాధించగలమని తెలిపారు. వసతి ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అలాగే వంట చేసే ప్రదేశం కూడా శుభ్రంగా ఉండాలని జేసీ హాస్టల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేయాలని ఈ సందర్భంగా తెలిపారు. జేసీ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, వసతి గృహ అధికారులు, తదితరులు ఉన్నారు.